నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర రావు తెలిపారు. స్పెన్సర్ ఫీడర్ పరిధిలోని శివాలయం టెంపుల్, రాజా డీలక్స్, రేస్‌కోర్స్, ఎన్‌బీకే ఎస్టేట్, చర్చీ గల్లీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... మూన్ కేఫ్ ఫీడర్ పరిధిలోని ఫీవర్ ఆస్పత్రి, శ్రీరాంనగర్, అచ్చయ్యనగర్, మూన్ కేఫ్, బృందావన్‌కాలనీ, హెరిటేజ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30గంటల వరకు.. అజామాబాద్ ఫీడర్ పరిధిలోని అచ్యుత్‌రెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీస్, రాంనగర్ గుండు, విద్యానగర్ పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఏఐ అండ్ డీఎస్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ (ఏఐ అండ్ డీఎస్) కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా 100కు పైగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 95058 00050.

నేలకూలిన భారీ వృక్షం



అంబర్‌పేట: జనవాసాల్లో రోడ్డుపై భారీ వృక్షం నేలకూలింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏమీ కాకున్న ఓ వాహనం ధ్వంసం అయ్యింది. ఈ సంఘటన శుక్రవారం అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు భూషణ్‌చారి, నవీన్ రెడ్డి, యాదగిరి, దయాకర్‌యాదవ్ తక్షణమే డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడం వారు సంఘటన స్థలానికి విచ్చేశారు. యుద్ధప్రతిపాదికన రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షాన్ని తొలగించారు.

వీధి దీపాల సమస్య పరిష్కారానికి కృషి

అంబర్‌పేట: డివిజన్‌లో వీధి దీపాల సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని బాగ్‌అంబర్‌పే కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. డివిజన్ల వీధి దీపాల సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి వాటిని మరమ్మతులను కార్పొరేటర్ దగ్గర ఉండి చేయించారు. వినాయక్‌నగర్, శివంరోడ్ తదితర ప్రాంతాల్లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ వీధి దీపాల విభాగం సిబ్బందితో వాటికి మరమ్మతులు చేపట్టారు.

పరామర్శ

ముషీరాబాద్: ఇటీవల జెమినికాలనీలో మృతి చెందిన యేసుమణి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారుడు డేవిడ్‌ను చనిపోయిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు.

నేర విచారణలో ఎలక్ట్రానిక్ ఆధారాలు కీలకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేర విచారణలో ఎలక్ట్రానిక్ ఆధారాలు కీలకపాత్ర పోషిస్తాయని హైకోర్టు న్యాయవాది సీవీఎల్ఎన్ మూర్తి అన్నారు. సీసీటీవీ, కాల్‌డేటా, వాట్సాప్ మేసేజీలు, ఈ మెయిల్స్ వంటి డిజిటల్ ఆధారాలు న్యాయ నిర్ణయంలో కీలకంగా మారుతున్నాయని అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ''రిలవెన్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ ఇన్ ట్రయల్''అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అయిలు ప్రధాన కార్యదర్శి పార్థసారథి, ఎల్‌ఎస్‌ఎఫ్ కన్వీనర్ అలీ హైదర్, శర్మ, ప్రవీణ్, రామచంద్రరెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటిస్తేనే వ్యాధులను నివారించవచ్చు

ముషీరాబాద్: పరిశుభ్రతను పాటిస్తేనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చునని జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మలేరియా, డెంగీ, విష జ్వరాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ రెడ్డి, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, విజయకృష్ణ, స్వరూపరాణి పాల్గొన్నారు.

జలమండలి జీహెచ్‌ఎంసీ

- అనుమతి లేకుండానే రోడ్డును తవ్విన జలమండలి
- జలమండలి అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన జీహెచ్‌ఎంసీ
- ఎమ్మెల్యే ముఠా గోపాల్ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ముషీరాబాద్: రెండు ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సింది పోయి ఒకరిపై ఒకరు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడం వివాదానికి దారి తీసింది. రోడ్ కటింగ్ చేయడానికి జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి తీసుకోకుండానే పనులు చేపట్టడం పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు సామగ్రిని సీజ్ చేశారు. అనంతరం జలమండలి అధికారులపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే ఆదేశించారని అనుమతి తీసుకోకుండానే...

అడిక్‌మెట్ డివిజన్‌లోని లక్ష్మమ్మ పార్కు వద్ద, రాంనగర్ డివిజన్‌లోని దయారామార్కెట్‌లో ఇటీవల ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొత్త పైపులైన్ వేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలనుసారం శుక్రవారం ఈ రెండు చోట్ల పనులు చేపట్టేందుకు జలమండలి సిబ్బంది రోడ్డును తవ్వారు. అయితే రోడ్డు పనులను పర్యవేక్షించడానికి వచ్చిన జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్ రోడ్ కటింగ్‌ను చూసి అభ్యంతరం వ్యక్తం చేశారు.

అనుమతి లేకుండా ఎలా తవ్వుతారు.?

జీహెచ్‌ఎంసీ వద్ద అనుమతి తీసుకోకుండా రోడ్డును ఎలా తవ్వుతారని జలమండలి అధికారులను ప్రశ్నించారు. ఇదంతా జరుగుతుంటే మీరు ఏమి చేస్తున్నారని జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ వినోద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు తవ్వకానికి తీసుకొచ్చిన సామగ్రిని ఆయన సీజ్ చేశారు. కాంట్రాక్టర్, జలమండలి అధికారులపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించడంతో డీఈ గీత ఫిర్యాదు చేశారు.



జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా రోడ్ కటింగ్ చేస్తున్న జలమండలి అధికారులు

విషయం తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే..

ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే అడ్డుకోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అరెస్టు అయిన వారిని విడుదల చేయాలని ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్‌తో మాట్లాడడానికి ఎమ్మెల్యే ఎంత ప్రయత్నించినా ఆయన ఫోన్ ఎత్తలేదు.

సమన్వయంతో పని చేయండి..

అనంతరం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అటూ జలమండలి అధికారులతో మరోవైపు జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడారు. సమన్వయంతో పని చేయాలని కోరారు. ఇరు శాఖలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటే అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతానికి కేసును వెనక్కి తీసుకోవాలని కోరడంతో ఇరు శాఖల వివాదం సద్దుమణిగినట్లు అయ్యింది.

జలమండలికి డిమాండ్ నోటీసు...

అనుమతి తీసుకోకుండా రోడ్డును తవ్వినందుకు నష్టపరిహారంగా రూ.2.30 లక్షలు చెల్లించాలని జలమండలికి జీహెచ్‌ఎంసీ డిమాండ్ నోటీసు అందించింది. భవిష్యత్‌లో రోడ్డు తవ్వాలంటే తప్పకుండా జీహెచ్‌ఎంసీ అధికారులను అనుమతి తీసుకోవాలని అందులో తెలిపింది.

ఎస్సార్టీలో అనుమతి లేకుండా నిర్మాణం

సర్కిల్ డీఎంసీ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలకు ఫిర్యాదు

చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లో ఎస్సార్టీలో జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జవహర్‌నగర్‌లోని శ్రీలక్ష్మి ఉప్పలమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం సర్కిల్ డీఎంసీ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... ఎస్సార్టీ కాలనీలోని 32 క్వార్టర్ యజమాని సాబేర్ బేగం జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణ పనుల్లో ఎలాంటి సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. పక్కనే ఉన్న అమ్మవారి ఆలయానికి ఇబ్బంది కలగకుండా నిర్మాణ పనులు సాగిస్తున్నారని చెప్పారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనికి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమతి లేకుండా నిర్మిస్తే తొలగిస్తాం..

జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా నిర్మించే ఎస్‌ఆర్టీ కాలనీలోని పనులను నిలిపివేశామని ఏసీపీ దేవేందర్ తెలిపారు. అనుమతి లేకుండా నిర్మిస్తే వెంటనే తొలగిస్తామని తెలిపారు.



అనుమతి లేకుండా జవహర్‌నగర్‌లో కొనసాగుతున్న నిర్మాణం

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ముషీరాబాద్: లేబర్ కోడ్స్ రద్దు కోసం, ఆర్టీసీల రక్షణ, విద్యుత్ బస్‌ల విధానంలో మార్పు కోసం ఈ నెల 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్సు భవన వద్ద కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా థామస్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెకు ఆర్టీసీ కార్మిక సంఘాలు మద్దతు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతూ ఇప్పటికే ఏడు ఆర్టీసీ సంఘాలు సమ్మె నోటీసు ఇచ్చిందన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీని ఖర్గే నిలబెట్టుకోవాలి

కాచిగూడ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీసీల న్యాయమైన సమస్యలను పరిష్కరించి అండగా ఉంటామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. శుక్రవారం జాతీయ బీసీ దళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి జాతీయ స్థాయిలో కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీని అమలు చేస్తే బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీని గుండెల్లో పెట్టుకుంటుందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రిజర్వేషన్ల అమలుకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే యుద్ధమే..

రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రంలో ఆందోళనకు సిద్ధంగా ఉండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రాష్ట్రంలోని ప్రతి సభలో దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వం జీవో తీసుకురాకుండా పెండింగ్‌లో పెట్టి బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. వెంటనే బీసీ రిజర్వేషన్లపై జీవో విడుదల చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నం.1పై ఓ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలి



లోయర్ ట్యాంక్‌బండ్ శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద ధర్నా చేస్తున్న భక్త సమాజం నాయకులు, బీజేపీ నేతలు

కవాడిగూడ: అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లోయర్ ట్యాంక్‌బండ్ శ్రీకనకాల కట్ట మైసమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లను నిర్మించాలని శ్రీకనకాల కట్ట మైసమ్మ దేవాలయ భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై గత ప్రభుత్వాలకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. నగరంలో ఉజ్జయిని మహంకాళి, గోల్కొండ, లాల్ దర్వాజ, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయల తరువాత అంతే విశిష్ట చరిత్ర కలిగిన కట్టమైసమ్మ దేవాలయంలో ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం తీరు భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని విమర్శించారు. కట్టమైసమ్మ దేవాలయం ఎదురుగా టూరిజంకు కేటాయించిన స్థలంలో వెంటనే శాశ్వత షెడ్లు నిర్మించాలని శుక్రవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో భక్త సమాజం అధ్యక్షుడు టి.రవీందర్, బీజేపీ నాయకులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, రమేష్‌రాం, పరిమల్ కుమార్, పీఎస్ చారి, మీసాల విఠల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకోండి



నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

ముషీరాబాద్: నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రగతిశీల యువజన సంఘం నాయకులు శుక్రవారం ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ తీసుకునే యువత రోజురోజుకు పెరిగిపోతున్నారని అన్నారు. అర్ధరాత్రి నిర్మానుష్య ప్రదేశాలను ఎంచుకొని అక్కడి నుంచే వెళ్లే మహిళలు, యువతులను వేధిస్తున్నారని తెలిపారు. ప్రధానంగా విద్యానగర్ రైల్వేస్టేషన్, అడిక్‌మెట్ బ్రిడ్జీ పక్కనే ఉన్న కమ్యూనిటీహాల్స్‌ను అడ్డాగా మార్చుకుని డ్రగ్స్‌ను సేవిస్తున్నారని ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు. విద్యానగర్ మార్క్స్ భవన్‌కు కొంత దూరంలో వీధి దీపాలు పగలగొట్టి చీకటో డ్రగ్స్ సేవిస్తున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎస్ ప్రదీప్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రవికుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ కృష్ణ, బీమేష్, కార్యదర్శులు కిరణ్, నరేష్, రాజు, ఆంజనేయులు, నవీన్, రమేష్, కృష్ణ, జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధాగ్నిని రగిలించిన యోధుడు 'దొడ్డి కొమురయ్య'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్కే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో సాయుధాగ్నిని రగిలించిన విప్లవ యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి అమరుడయ్యారని తెలిపారు. కమ్యూనిస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోరాటంలో 4వేల మంది వీరులు తమ ప్రాణాలను కోల్పోతే 10 లక్షల ఎకరాలను పేదలకు పంచారని గుర్తుచేశారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్. వినయ కుమార్ మాట్లాడుతూ... బడుగులు సాధించిన సాయుధ పోరాట విజయాలను ఆనాటి కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులపై కక్షతో రజాకారుర్లు, భూస్వాములను చేరదీసి రైతాంగ సాయుధ పోరాటానికి ద్రోహం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, మురళీధర్ దేశ్‌పాండే, బుచ్చిరెడ్డి, మహేష్ దుర్గే, ఎస్.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

సభకు కాంగ్రెస్ నేతలు

టీపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన సామాజిక న్యాయ సమరభేరి సభకు అంబర్‌పేట్, ముషీరాబాద్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీగా తరలి వెళ్లారు.



ఏ కుల సంఘ భవనం ఎండోమెంట్ పరిధిలో లేదు

మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించాలి



డాక్టర్ కొండ దేవయ్య పటేల్, మహేందర్ కుమారేను సన్మానిస్తున్న ప్రొ. మ్యాడం వెంకట్‌రావు

కాచిగూడ: తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కొండ దేవయ్య పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఆర్.వి.మహేందర్ కుమార్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు ఆధ్వర్యంలో మున్నూరుకాపులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండా దేవయ్యపటేల్ మాట్లాడుతూ.. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి పూర్తిగా తొలగించి మున్నూరుకాపులకు అప్పగించాలన్నారు. ఇప్పటికే ఈ విషయంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీతో చర్చించి వినతి పత్రం అందజేశామన్నారు. ఇప్పటి వరకు ఏ కుల సంఘ భవనం ఎండోమెంట్ పరిధిలో లేదని, ఒక్క మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం మాత్రమే ఎండోమెంట్ పరిధిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి ఎండోమెంట్ పరిధి నుంచి తీసివేసే విధంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

సెక్రటేరియట్ ముట్టడి.. ఎక్కడికక్కడే కట్టడి

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలనే డిమాండ్‌తో నిరుద్యోగులు శుక్రవారం సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్ కుమార్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్‌లు రాజునాయక్, రాంబాబుల పర్యవేక్షణలో శుక్రవారం చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, చిక్కడపల్లి, జవహర్‌నగర్, అశోక్‌నగర్ చౌరస్తాలో బందోబస్తు నిర్వహించారు. పకడ్బందీగా బందోబస్తు చేపట్టడంతో నిదుద్యోగులు ఎవరూ లైబ్రరీ వద్దకు చేరుకోలేదు. అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరిని పోలీసులు ప్రశ్నించి అదుపులోకి తీసుకున్నారు. అయితే జేఏసీ నాయకులు రవి రాథోడ్, మహేందర్, సాయి కుమార్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీని నెరవేర్చాలని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తారా? అని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. ఇచ్చిన హామీల అమలు కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



నగర కేంద్ర గ్రంథాలయం ఎదుట బందోబస్తు

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



శాస్త్రీనగర్‌లో విద్యుత్ స్తంభం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో లోవోల్టేజీ, ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని శాస్త్రీనగర్‌లో జనావాసాలకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం, ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతనంగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ... అవసరమైన చోట బంచ్ విద్యుత్ కేబుల్‌ను ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ సుదామా, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పీర్లకు దట్టీలు సమర్పించిన ఎమ్మెల్యే

భోలక్‌పూర్ డివిజన్ బడీ మసీదు వద్ద గల ఆషుర్‌ఖానాలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంప్రదాయ పద్ధతిలో పీర్లకు దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హరితహారం

అడిక్‌మెట్ డివిజన్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో జరిగిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రావు, రహీం, ఉమాకాంత్, శంకర్‌గౌడ్, మున్వర్‌చాంద్, ప్రవీణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



బాపూజీనగర్‌లో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్లే పేదలకు ఇళ్లు దక్కడం లేదని విమర్శించారు. శుక్రవారం సాయంత్రం బాపూజీనగర్‌లో వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. తాను ముషీరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 3వేల ఇళ్లు వాంబే పథకం ద్వారా నిర్మించి ఇచ్చామని తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో లంబాడీ తండా వాసులకు సైతం పక్కా గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా...

◆ గాంధీనగర్, భోలక్‌పూర్ సమీపంలోని నేతాజీనగర్‌లో ఆక్రమణల రోడ్డు విస్తరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసిన అధికారులు ప్రత్యామ్నాయం చూపించకపోవడంతో ఇప్పుడు ఆ దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. తన ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు బాధితులకు పక్కా గృహాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్లు కేటాయించకపోవడం సరికాదన్నారు. త్వరలో జిల్లా కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత అందుబాటులోకి పవర్‌బోర్...

◆ బాపూజీనగర్‌లో నీటి ఎద్దడిని తీర్చేందుకు 2016లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్ పవర్ బోర్ పనులను ప్రారంభించారు. కానీ దానికి విద్యుత్ సరఫరా లేకపోవడం రూ.లక్షలాది వెచ్చించి ఏర్పాటు చేసిన బోర్ నిరుపయోగంగా మారింది. దీంతో స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పవర్ బోర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోర్టులో కేసు వేశారు. కోర్టు ఆదేశాలతో పవర్ బోర్‌కు విద్యుత్ బిల్లులు తామే చెల్లిస్తామని జలమండలి అధికారులు ఒప్పుకోవడంతో ఈ మేరకు శుక్రవారం పవర్ బోర్ (వాటర్ ట్యాంక్) ఆయన ప్రారంభించారు.